క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఉదయగిరి రూరల్: విద్యార్థి దశ నుంచే నిత్యం యోగా సాధనను అలవాటు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంఈఓ–1 వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్ఎం హజరత్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



సంగం: మండలంలోని మర్రిపాడు చెన్నకేశవ స్వామి ఆలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మందిపాటి శ్రీహరిరెడ్డితో పాటు 9 మంది సభ్యులతో ఈఓ రఘురామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు.

చెత్త బుట్టలకు మోక్షం



దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలోని ఓ గదిలో పడేసిన చెత్తబుట్టలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రభుత్వం స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాల్లోని ఇంటింటికి పంపిణీ చేసేందుకు చెత్తబుట్టలను సరఫరా చేసింది. అయితే ఏడాది గడుస్తున్నా పంచాయతీలకు పంపిణీ చేయకుండా మండల పరిషత్ కార్యాలయంలో అలాగే ఉంచేశారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు అధికారులు సోమవారం పంచాయతీలకు పంపిణీ చేశారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు వినతి



ఉదయగిరి రూరల్ : నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో వెనుకబడిన మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లాను చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎల్ రామ్మోహన్‌కు సోమవారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు బకీర్‌జాషువా, బెజవాడ బాలగురవయ్య, పెంచలయ్య, ఇత్తడి రమణయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: చేజర్ల మండలానికి చెందిన పేద ఇంజనీరింగ్ విద్యార్థి వీ శ్రీరామ్‌నవీన్‌కు ఆత్మకూరు చెందిన వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు జే ప్రణీత్ సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. నవీన్ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని నగదు సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్లు వెంకటసందీప్, కుమార్, తోడేటి అశోక్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచ్‌ల ఏర్పాటు

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో ప్రయాణికులు, గ్రామస్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో సిమెంట్ బెంచ్‌లను సోమవారం ఏర్పాటు చేశారు. ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతుండడంతో దాతలు రావుల భాగ్యలక్ష్మి, చాగంటి లక్ష్మీదేవమ్మ, దండా సంపతమ్మ, చాగంటి వెంకటేశ్వరరెడ్డి, సుతారు నవీన్, సుతారు విశ్వాచారి ముందుకు వచ్చి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐదు, ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ఒకటి, వీరబ్రహ్మేంద్రస్వామి మందిరం వద్ద రెండు చొప్పున ఏర్పాటు చేశారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు, శంఖవరం గ్రామాల్లోని ప్రభుత్వ భూముల ఆక్రమణపై పలువురు తహసీల్దార్ హమీద్‌కు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. వింజమూరులోని భట్టువారిపాళెం రోడ్డు సమీపంలోని సర్వే నంబర్లు 271, 279లో ఉన్న సుమారు 3.5 ఎకరాల ప్రభుత్వ పోరంబోకులో కొంతమంది అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారని గువ్వల రవీంద్రరెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే శంఖవరం గ్రామంలో సర్వే నంబర్లు 167, 169లోని పోరంబోకు భూములను కొంతమంది ఆక్రమించి సాగుచేస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

వినాయక చవితి కోలాహలం

- వాడవాడలా ముస్తాబవుతున్న గణనాథుని మండపాలు
- అట్టహాసంగా ఉత్సవాల నిర్వహణకు కమిటీలు సన్నాహాలు
- విక్రయానికి వివిధ రూపాల్లోని భారీ విగ్రహాలు
- ఈ ఏడాది భారీగా పెరిగిన ధరలు



ఉదయగిరిలోని ట్యాంక్‌బండ్‌పై అమ్మకానికి ఉంచిన వినాయకుడి ప్రతిమలు

కలిగిరి/ఆత్మకూరు/దుత్తలూరు: పట్టణాలతో పాటు పల్లెల్లోనూ వినాయక చవితి కోలాహలం మొదలైంది. వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. వినాయక చవితి సమీపించడంతో మండపాలను నిర్మించి విగ్రహాలను కొనుగోలు చేయడంలో నిమగ్నమయ్యారు.

ముస్తాబైన ప్రతిమలు

వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులు ముస్తాబయ్యారు. పట్టణ, మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేసుకుని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కళాకారులు వివిధ రూపాల్లోని భారీ ప్రతిమలను కళాకారులు రూపొందించారు. వినాయక చవితి సమీపించడంతో రంగులతో తుది మెరుగులు దిద్ది విక్రయాలకు సిద్ధం చేశారు. ఉత్సవాల నిర్వాహకులు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ముందస్తు అడ్వాన్సులు చెల్లించి విగ్రహాలను చేయించుకుంటున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నాలుగు చోట్ల షెడ్లు ఏర్పాటు చేసుకుని రాజస్థాన్, బీహార్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు రెండు నెలలుగా విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. సుమారు రూ.15 లక్షలకుపైగా పెట్టుబడులు పెట్టి ఒక్కో షెడ్డులో 100 నుంచి 120 విగ్రహాల వరకు తయారు చేశారు. విగ్రహాల సైజులను బట్టి రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారు. విగ్రహాలు మొత్తం అమ్ముడుపోతే ఖర్చులు పోగా రూ.2 లక్షలు లేదా రూ.3 లక్షలు మిగులుతాయని తయారీదారులు తెలిపారు.

భారీగా పెరిగిన విగ్రహాల ధరలు

ఈ ఏడాది వినాయకుని విగ్రహాల ధరలు గతేడాదితో పోలిస్తే దాదాపు రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. గతంలో ఐదు అడుగుల విగ్రహాలను రూ. 8వేల నుంచి రూ.10వేల వరకు అమ్మేవారు. అదే విగ్రహాలను ఈ ఏడాది రూ.15వేల వరకు అమ్మకాలు జరుపుతున్నారు. పది అడుగుల పైన ఉన్న విగ్రహాలు, డిజైన్లు, ఇతర దేవతామూర్తుల కాంబినేషన్లు, రంగులు కలిగిన విగ్రహాలు రూ. 30వేలపైగా పలుకుతున్నాయి.

ఖర్చుకు తగ్గేదిలే..

ఉత్సవాల నిర్వహణకు ఎంత ఖర్చు అయినా తగ్గేదిలే అంటూ ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవాల కమిటీ సభ్యులు సిద్ధమవుతున్నారు. ముందస్తుగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఉత్సవాల నిర్వహణ, ఖర్చుల ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. డీజే సౌండ్, డప్పు వాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు ముందస్తుగా అడ్వాన్స్‌లు చెల్లించి బుక్ చేసుకుంటున్నారు.

సింగిల్ విండో విధానంలో అనుమతులు

వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇందుకు ఉత్సవ కమిటీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. https://ganeshutsav.net వెబ్‌సైట్‌లోకి వెళ్లి న్యూ అప్లికేషన్ మీద క్లిక్ చేసి మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ వెరిఫికేషన్ పూర్తయ్యాక దరఖాస్తు విండో ఓపెన్ అవుతుంది. అందులో దరఖాస్తుదారుని పేరు, మొబైల్ నంబరు, ఈ–మెయిల్ అడ్రస్సు, చిరునామా, అసోసియేషన్/కమిటీ పేరు నమోదు చేయాలి. గణేశ్ మండపం స్థలం, ఎత్తు, విగ్రహం ఎత్తు, ఏ పోలీసు సబ్‌డివిజన్, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. గణేశ్ నిమజ్జనం చేసే తేదీ, సమయం, వాహనం, డ్రైవర్ వివరాలు నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పోలీసులు మండపాన్ని పరిశీలించి, అనుమతులు మంజూరు చేస్తారు.



ఆత్మకూరు:వినాయకుడి ప్రతిమకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు



కలిగిరిలో ఆకర్షణీయంగా సిద్ధం చేసిన గణనాథుని విగ్రహాలు

ప్రశాంతంగా జరుపుకోవాలి



వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి. విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే వారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలి.

– వెంకటనారాయణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, కలిగిరి

15 ఏళ్లుగా విగ్రహాలను చేస్తున్నాం



గత 15 ఏళ్లుగా ఆత్మకూరులో వినాయకుని విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నాం. ఇటీవల పడిన వర్షాలతో కొంత ఇబ్బంది పడ్డాం. దేవుడి దయ వల్ల మరో రెండు రోజులు వర్షం పడకపోతే వినాయక చవితిని శుభంగా జరుపుకొనేందుకు వీలు కలుగుతుంది. విగ్రహాల విక్రయాలు బాగా జరుగుతాయి.

– జమునా, రామ్‌లాల్, రాజస్థాన్

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

కావలి (జలదంకి): కావలి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన గీతాంజలి (30) అనే వివాహిత విద్యుదాఘాతానికి గురైన మృతి చెందింది. వివరాలు.. రామచంద్రాపురానికి చెందిన గంటా కృష్ణమూర్తి, గీతాంజలి దంపతులు. కృష్ణమూర్తి ఐదు రోజులుగా గొలగమూడిలో వెంకయ్య స్వామి ఆరాధన జరుగుతుండగా ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి భార్య గీతాంజలి, ఇద్దరు కుమార్తెలతో ఫోన్లో మాట్లాడాడు. అనంతరం రాత్రి 10 గంటల సమయంలో లోటల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో గీతాంజలి ఇన్వర్టర్ స్విచ్ ఆపబోయి విద్యుదాఘాతానికి గురైంది. ఈ క్రమంలో చేతులు, ఛాతి, గొంతు, తదితర భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు కావలిలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కావలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

దగదర్తి: రైతులకు 50 శాతం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. దగదర్తిలోని గ్రామ సచివాలయంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. వీఏఏ ఎం మీరయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

జలదంకి: మండలంలోని 14వ మైలు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..కలిగిరి మండలం కుమ్మరకొండూరుకు చెందిన కంచెంరెడ్డి లక్ష్మిరెడ్డి స్కూటీపై జలదంకి వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. 14వ మైలు సమీపంలోకి రాగానే కలిగిరి నుంచి జలదంకి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం తొలుత కావలికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. జలదంకి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

సంగం: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ వేమారెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. డీజేలు, అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవని, వాటిని ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా ఉత్సవాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



మర్రిపాడు: చిరుధాన్యాల సాగు లాభదాయకమని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త జీ లలిత శివజ్యోతి పేర్కొన్నారు. మండలంలోని కంపసముద్రం లో సాగుచేసిన నూతన రకం ఏబీవీ04 సజ్జ పంటను రైతులతో కలిసి వ్యవసాయశాస్త్రవేత్తలు, అధికారులు సోమవారం క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా లలితశివజ్యోతి మాట్లాడుతూ చిరుధాన్యాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఏబీవీ 04 రకం సజ్జ పంట తక్కువ కాలంలోనే అధిక దిగుబడులు ఇస్తుందన్నారు. బెట్టతో పాటు వెర్రికంకి, అగ్గి, కాటుక వంటి తెగుళ్లను తట్టుకుంటుందని వివరించారు. కేవీకే శాస్త్రవేత్త కిరణ్ కుమార్‌రెడ్డి , ఉదయగిరి ఏడీఏ జీ లక్ష్మీమాధవి, మర్రిపాడు, దుత్తలూరు ఏఓలు కవిత పాల్గొన్నారు.

స్టీల్ అక్రమంగా తరలించిన వారిపై చర్యలు

దుత్తలూరు: దుత్తలూరులోని హౌసింగ్ గోదాము నుంచి స్టీల్‌ను అక్రమంగా తరలించిన వారిపై రెండుమూడ్రోజుల్లో చర్యలు తీసుకుంటామని హౌసింగ్ ఈఈ పీవీ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విజయవాడ విజిలెన్స్ డీఈపీ చంద్రశేఖర్‌రాజుతో కలిసి దుత్తలూరులోని హౌసింగ్ గోదామును పరిశీలించారు. అనంతరం హౌసింగ్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. దుత్తలూరు హౌసింగ్ శాఖకు ప్రభుత్వం ఎన్ని టన్నుల స్టీలు మంజూరు చేసింది..లబ్ధిదారులకు ఎంత మేర అందజేశారు..ఇంకా నిల్వ ఎంత ఉందనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ను అక్రమంగా తరలించిన ఉదయగిరి ఏఈ రామకృష్ణపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, రెండు మూడ్రోజుల్లో చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ ఘటనలో పాత్రధారులు ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయం పోలీసుల విచారణలో తేలుతుందన్నారు. హౌసింగ్ డీ పీరాన్, ఏఈ ఎఫ్రాయిం, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ



ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగుకు చదును చేసిన దృశ్యం

ఆత్మకూరు: చేజర్ల మండలం బిల్లుపాడులో అటవీ, గ్రామ చెరువు సమీపంలోని ప్రభుత్వ భూములను స్థానిక టీడీపీ నాయకులు దర్జాగా కబ్జా చేసి సాగు చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అటవీ ప్రాంతం సమీపంలోని సర్వే నంబర్ 1లోని పోరంబోకు భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు నాయకులు కబ్జా చేశారు. జేసీబీ సాయంతో సుమారు 10 నుంచి 12 ఎకరాల వరకు చదును చేసి సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే సొంతంగా రెండెకరాలు చొప్పున పట్టా భూమి కలిగి ఉన్న వారు గ్రామ చెరువు సమీపంలోని సుమారు 10 ఎకరాలకుపైగా ఆక్రమణ చేశారు. దర్జాగా వరిపైరు సాగు చేస్తున్నారు. ఇటీవల రీసర్వేలో భూమి తమ పెద్దల ద్వారా వారసత్వంగా వచ్చిందని ఆక్రమణదారులు చెప్పడం విశేషం. అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇష్టారాజ్యంగా ఆక్రమణలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై చేజర్ల తహసీల్దార్ బీ మురళీని సంప్రదించగా ఇప్పుడే ఆక్రమణల విషయం తన దృష్టికి వచ్చిందని, వీఆర్వోను పంపి పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మందబయలును విడిపించాలని వినతి

జలదంకి: కమ్మపాళెంలో పంచాయతీలోని మందబయలు భూమిని ఆక్రమణదారుల చెర నుంచి విడిపించాలని రైతులు కోరారు. ఈ మేరకు జలదంకి తహసీల్దార్ ప్రమీలకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 436, 436–ఏ, 455 సర్వే నంబర్లలో 16 ఎకరాలు మందబయలు భూమిని రెవెన్యూ అధికారులు తమ కార్యాలయంలోని కొంతమంది సిబ్బందితో పాటు మరికొంత మంది పేర్లపైకి భూమిని ఎక్కించి పట్టాలు సైతం అందజేశారని తెలిపారు. సదరు వ్యక్తులు భూములపై రుణాలు కూడా తెచ్చుకున్నారని చెప్పారు. మందబయలు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని హద్దులు చూపాలని కోరారు.

భూ ఆక్రమణదారుడిపై ఫిర్యాదు

కొండాపురం: గత 15 ఏళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూమిని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మల్లె ఏడుకొండలు తమను బెదిరించి లాక్కున్నాడని గరిమెనపెంట పంచాయతీ పరిధిలోని చల్లగిరిగల గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీలు వాపోయారు. సోమవారం వారు తహసీల్దార్ సురేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్లు 257, 257/1, 256/1, 259/1 258లోని సుమారు 28 ఎకరాల భూమిని పొలం లేని 20 మంది చేసుకుంటున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు యారవ కృష్ణయ్య అండదండలతో మల్లె ఏడుకొండలు అనే వ్యక్తి కొంత పొలాన్ని దున్ని జామాయిల్ సాగు చేశాడని తెలిపారు. మిగిలిన భూమిని సాగు చేసేందుకు దున్నుతున్నాడని వాపోయారు.

'గండిపాళెం'లో విగ్రహాల నిమజ్జనానికి అనుమతుల్లేవు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయంలో నీటిమట్టం అడుగంటి ఉన్నందున గణేశ్ నిమజ్జనానికి అనుమతి లేదని జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండిపాళెం పరిసర గ్రామాల ప్రజలు విగ్రహాలను జలాశయంలో కాకుండా ఇతర ప్రాంతాల్లోని నీటి వనరుల్లో నిమజ్జనం చేసుకోవాలని కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి జలాశయంలో విగ్రహాలను నిమజ్జనం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇన్‌స్పైర్ మనక్‌కు నామినేషన్లు

ఉదయగిరి: మండలంలోని ప్రాథమికోన్నత ,ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ మనక్‌కు నామినేషన్లను సెప్టెంబర్ 15వతేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు చొప్పున నామినేషన్లు అప్‌లోడ్ చేయాలన్నారు. వీలైనంత త్వరగా నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

వైఎస్సార్ విగ్రహాలకు రంగులు

ఉదయగిరి: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని 27 వైఎస్సార్ విగ్రహాలకు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండా రాజగోపాల్‌రెడ్డి తన సొంత నిధులతో రంగులు వేయిస్తున్నారు. ఆది, సోమవారాల్లో జీ చెరువుపల్లి, దేకూరుపల్లి, జీ అయ్యవారిపల్లిలోని విగ్రహాలకు రంగులు వేయించే ప్రక్రియను ప్రారంభించారు. సెప్టెంబరు 1వ తేదీ నాటికి మండలంలోని అన్ని విగ్రహాలకు రంగులు వేసే ప్రక్రియను పూర్తిచేస్తామని ఆయన తెలిపారు.

పాఠశాల వద్ద బెల్టుషాపు తొలగించండి

ఆత్మకూరు: చేజర్ల మండలం మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మద్యం బెల్టు దుకాణాన్ని తొలగించాలని సర్పంచ్ చిన్నయ్య వార్డు సభ్యులతో కలిసి నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల ప్రహరీ వద్ద బెల్టు దుకాణం నిర్వహిస్తుండడంతో విద్యార్థులతో పాటు ఆటుగా వెళ్లే మహిళలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.

హెచ్ఐవీపై అవగాహన



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐలోని విద్యార్థులకు సార్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు నాగేశ్వరరావు, బీ మురళీధర్, ఎస్ శ్రీధర్, ఏటీఓ ఎం ఉమామహేశ్వరరావు, సార్ప్ ప్రతినిధులు జెనోమి, సునంద, సుస్మిత, సుగుణ, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటులో వివాదం

- ఎమ్మెల్యే చెప్పాడంటూ టీడీపీ వర్గీయుల ఓవరాక్షన్



ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

జలదంకి: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో వినాయక విగ్రహాల ఏర్పాటులో వివాదం చెలరేగింది. కలిగిరి సీఐ పీ వెంకటనారాయణ, జలదంకి ఎస్సై లతీఫున్నీసా విచారణ చేపట్టారు. కొన్నేళ్లుగా యువకులు చందాలు వసూలు చేసి గుడి వద్ద విగ్రహం పెడుతున్నారు. ఈసారి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే గ్రామంలో కొందరు టీడీపీ వర్గీయులు చందాలు వసూలు చేశారు. కాగా యువకులు, టీడీపీ వర్గీయులు విగ్రహాలను తీసుకొచ్చారు. గుడి వద్ద ఎవరి విగ్రహం పెట్టాలనే విషయంలో వివాదం జరగడంతో జలదంకి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు సోమవారం గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. టీడీపీకి చెందిన వారు మా విగ్రహమే గుడి వద్ద ఉండాలని పట్టుబట్టారు. యువకులు మాత్రం రెండు విగ్రహాలను గుడి వద్ద ఏర్పాటు చేసుందామని, లేనిపక్షంలో నచ్చిన స్థలంలో పెట్టుకుందామన్నారు. అయితే టీడీపీ వర్గీయులు మాకు ఎమ్మెల్యే చెప్పాడు. మా విగ్రహమే పెట్టాలని వాదనకు దిగారు. దేవుడి విగ్రహాల విషయంలో రాజకీయాలు చేస్తున్నారంటూ యువకులు అసంతృప్తి వ్యక్తం చేసి వెళ్లిపోయారు. విచారణ సమయంలో కొందరు మహిళలు ఎమ్మెల్యే మా విగ్రహమే పెట్టుకోమన్నాడంటూ ఫోన్‌ను సీఐకు ఇవ్వబోయారు. దేవుడి విగ్రహాల విష యంలో గొడవలు వద్దని, పెద్దలందరూ కూర్చుని మాట్లాడుకుని ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ సూచించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన



ఉదయగిరి రూరల్: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా ప్రజలపై భారం మోపుతోందని, స్మార్ట్ మీటర్లను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పిలుపునిచ్చారు. మండలంలోని లింగమనేనిపల్లిలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను దేశంలోని అన్ని రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మన రాష్ట్రం ఏర్పాటు చేస్తుండడం దారుణంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగులగొట్టాలన్న చంద్రబాబు ఇప్పుడు వాటిని ఏర్పాటు చేస్తూ ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఆత్మకూరురూరల్: రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరులోని ఎరువుల దుకాణాల్లో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నెల్లూరు తహసీల్దార్ జీఎస్ ప్రసాద్, ఉదయగిరి ఏడీఏ జీ లక్ష్మీమాధవి దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్లుల పుస్తకాలను తనిఖీ చేసి గోదాముల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని 44.186 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలను గుర్తించి తాత్కాలికంగా విక్రయాలను నిలిపివేశారు. ఆహార భద్రత మిషన్ పథకం కింద సరఫరా చేస్తున్న యూరియాను జామాయిల్, సరుగుడు తోటల రైతులకు విక్రయించరాదని డీలర్లను హెచ్చరించారు. వారి వెంట ఏఓ కిషోర్ ఉన్నారు.

జలదంకి : మండలంలోని 12 ఎరువుల దుకాణాలను కోవూరు ఏడీఏ అనిత జలదంకి ఏఓ శ్రీవాణితో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి గోదాముల్లో నిల్వలను పరిశీలించి వ్యాపారులకు సూచనలు చేశారు. కృత్రిమ కొరత సృష్టించి యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



దుత్తలూరు: స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరు/ఆత్మకూరు/కలిగిరి/సంగం/వరికుంటపాడు: రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని సోమవారం నుంచి ప్రారంభించారు. దుత్తలూరులోని ఒకటో రేషన్ దుకాణంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, కంభం అనసూయమ్మ, తహసీల్దార్ యనమల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరులోని 15వ వార్డు గిరిజనకాలనీలో తహసీల్దార్ పద్మజాకుమారితో కలిసి ఆర్డీఓ బీ పావని స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. మండల కేంద్రమైన కలిగిరి పంచాయతీ పరిధిలోని కొప్పోలువారిపాళెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం గిరీషకుమార్ సోమవారం ప్రారంభించారు. వరికుంటపాడు ఎస్సీ కాలనీలో తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీఓ గోపి శ్రీనివాసులు స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రాంభించారు. మండలంలో 9,047 స్మార్ట్ కార్డులు మంజూరయ్యాయని తహసీల్దార్ తెలిపారు. కార్డులోని క్యూఆర్ కోడ్‌ను ఈపోస్ మెషీన్‌కు చూపితే కుటుంబ సభ్యుల వివరాలు కనిపిస్తాయని తెలిపారు. వేలిముద్రలు పడని వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సంగంలోని కొత్తూరు సెంటర్‌లోని రేషన్ దుకాణం–3 పరిధిలో తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ షాలెట్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.